20-05-2025
మంగళవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత

# జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 232 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB
జయభేరి



తెలంగాణలోని గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపే సరికొత్త పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 2,30,735 మంది గిరిజన రైతులకు 6.69 లక్షల ఎకరాలకు భూయాజమాన్యపు హక్కులు కల్పించే "ఇందిర సౌర గిరి జల వికాసం" పథకానికి సంబంధించి "నల్లమల డిక్లరేషన్" ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

## ఇందిరమ్మ నిర్ణయాలు..
# సాహసోపేతం

■ నల్లమల్ల డిక్లరేషన్ ప్రకటించిన రేవంత్

జయభేరి, మహబూబ్ నగర్, మే 19

పహల్గామ్‌లో ఉగ్రదాడి అనంతరం తదితర పరిణామాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. పౌరుషం కలిగిన నాయకురాలు ఇందిరాగాంధీ అని.. పేర్కొన్నారు.. పాకిస్తాన్‌తో తాజా యుద్ధం నేపథ్యంలో 50 ఏళ్ల తర్వాత కూడా ఇందిరాగాంధీ వంటి నాయకురాలి అవసరాన్ని ప్రజలు గుర్తించారని పేర్కొన్నారు. ఈ రాజ్యమే ఇందిరమ్మ రాజ్యమంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై కొందరు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. సోషల్ మీడియా ద్వారా విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కానీ నిజాలు ఆలస్యంగా అయినా ప్రజలు తెలుసుకుంటారన్నారు. సన్న బియ్యం తీసుకుంటున్న ఆడబిడ్డలు, ఉద్యోగాలు పొందిన యువత ఈ ప్రభుత్వానికి అండగా ఉంటారని సీఎం అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులతో కలిసి 'ఇందిర సౌర గిరి జల వికాసం'

...మిగతాది 2 లో

## జూన్ 12 తర్వాత ఎప్పుడైనా
# ఆకస్మిక తనిఖీలు



- ప్రజలకు అందించే సేవల్లో పూర్తిస్థాయి సంతృప్తి రావాల్సిందే
- ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపడాలి
- దీపం లబ్ధిదారుల ఖాతాలో ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము
- డాటా అనలిటిక్స్‌కు అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి
- ప్రభుత్వ పథకాలు, సేవలపై సమీక్షలో సిఎం చంద్రబాబు నాయుడు

జయభేరి, అమరావతి, మే 19 :

జూన్ 12 తరువాత ఎప్పుడైనా రాష్ట్రంలో ఆకస్మిక తనిఖీలు మొదలు పెడతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, వివిధ ప్రభుత్వ సేవలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. ప్రతివారం నాలుగు శాఖల పరిధిలో పథకాలు, సేవలపై ప్రజలనుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను సమీక్షిస్తున్న సీఎం... రేషన్, దీపం, ఎపిఎస్ఆర్టీసీ, పంచాయతీ సేవలపై వెల్లడైన ప్రజాభిప్రాయాలను పరిశీలించారు. ఈ శాఖల పరిధిలో అమలు అవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల నుంచి ఐవిఆర్ఎస్, క్యూ ఆర్ కోడ్ వంటి విధానాల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ అభిప్రాయాలపై సిఎస్, సిఎంవో సెక్రటరీలతో ముఖ్యమంత్రి చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తుందని... అన్ని శాఖల్లో ప్రభుత్వ పనితీరు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయి

...మిగతాది 2 లో

# అందాల పోటీలే కాదు..
## అగ్ని ప్రమాదాలు పట్టించుకోండి



జయభేరి, హైదరాబాద్, మే 19:

అందాల పోటీల మీద పెట్టే ఖర్చు ప్రజల ప్రాణాలు కాపాడడానికి కూడా పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి రేవంత్ రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి బాధితులను పరామర్శించాలన్నారు. పాతబస్తీ చార్మినార్‌లోని గుల్జార్ హౌస్ సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సోమవారం నాడు కేటీఆర్ పరిశీలించారు. హైదరాబాద్ చరిత్రలోనే అతిపెద్ద అగ్నిప్రమాదం, ఎక్కువ ప్రాణాలు పోయిన దుర్ఘటన ఇదన్నారు. క్షతగాత్రులను, బాధిత కుటుంబసభ్యులను కేటీఆర్ ఓదార్చారు. ప్రభుత్వం అందాల పోటీలపై చూపే శ్రద్ధ, అగ్నిప్రమాదాలు, వాటి నివారణపై పెడితే బాగుండేదన్నారు. చనిపోయిన తరువాత ఏదో రూ.5 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదు, ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు కాదు రూ.25 లక్షల నష్ట పరిహారం

...మిగతాది 2 లో



# యూ ట్యూబర్..
## మల్హోత్ర కథ చాలా ఉంది

జయభేరి, హైదరాబాద్, మే 19:

పేరుకే యూట్యూబర్.. కానీ ఆమె వెనుక చాలా కథ నడిచింది. జ్యోతి మల్హోత్రా పరిచయాలు, లావాదేవీలపై దర్యాప్తు సంస్థలు లోతుగా ఆరాతీస్తున్నాయి. పాకిస్తాన్‌కి గూఢచర్యం చేస్తూ దేశ సున్నిత సమాచారాన్ని పాక్‌కి చేరవేస్తోందన్న ఆరోపణలపై అరెస్టయిన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా జాడలు హైదరాబాద్‌లోనూ వెలుగుచూశాయి. 2023 సెప్టెంబరులో ప్రధాని వర్చువల్‌గా హైదరాబాద్

...మిగతాది 2 లో

# కుండబద్దలు కొట్టిన సుప్రీం
## శరణార్థులకు భారత్ లో ఆశ్రయం ఉండదు



జయభేరి, న్యూఢిల్లీ, మే 19 :

శరణార్థులకు భారత్‌లో ఆశ్రయం ఇవ్వలేమంటూ సుప్రీం కోర్టు సంచలన తీర్పును వెలువరించింది.. భారత్ ధర్మశాల కాదు.. వివిధ దేశాల శరణార్థులకు భారత్ ఆశ్రయం ఇవ్వలేదు.. తక్షణం శరణార్థులు దేశాన్ని వీడాలి అంటూ.. సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.. ఈ మేరకు శ్రీలంక శరణార్థులు వేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టివేసింది.. భారతదేశం ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు ఆతిథ్యం ఇవ్వగల ధర్మశాల కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.. శ్రీలంక తమిళ జాతీయుడి నిర్బంధంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది.భారతదేశం ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు ఆతిథ్యం ఇవ్వాలా? మనం 140 కోట్ల మందితో ఇబ్బంది పడుతున్నాము. ఇది మనం అన్ని ప్రాంతాల నుండి వచ్చే విదేశీయులకు వినోదం అందించగల ధర్మశాల కాదు" అని ధర్మాసనం అధ్యక్షత వహించిన జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారుయుఎపిఎ కేసులో విధించిన 7 సంవత్సరాల జైలు శిక్ష ముగిసిన వెంటనే

...మిగతాది 2 లో









▶▶ మొదటిపేజీ తరువాయి

## ఇందిరమ్మ నిర్ణయాలు..

పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేశారు.కడుపు నిండా విషం పెట్టుకుని రాష్ట్ర ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని.. వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవరు ఎలాంటి విష ప్రచారం చేసినా..ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారంటూ సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ప్రతిఊరులో ఒకరిద్దరు సన్నాసులు ఉన్నంతమాత్రాన ఊరు పాడవుతుందా? అని ప్రశ్నించారు.నల్లమల అంటే ఒకప్పుడు వెనకబడిన ప్రాంతమని.. పాలమూరు, నల్లమల అంటే తనకు ఎంతో గౌరవం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాలమూరు బిడ్డల చెమటతోనే ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందన్నారు. గత ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చారు.. ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు.రైతులకు బేడీలు వేసిన చరిత్ర గతపాలకులది అని సీఎం రేవంత్ అన్నారు.మహిళలే ఆర్టీసీ బస్‌లు అద్దెకు తిప్పుకునేలా చేశామని..సోలార్ విద్యుత్ ఉత్పత్తిద్వారా మహిళలు అదానీలతో పోటీపడుతున్నారని సీఎం రేవంత్ అన్నారు.మహిళాసంఘాలను బంక్‌లకు యజమానులను చేశామన్నారు. 2029లోపు కోటిమంది మహిళలు కోటీశ్వరులు కావడమే లక్ష్యమన్నారు. తొలి ఏడాదిలోనే లక్షా 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. విద్యకు అత్యధిక ప్రాధాన్య తఇస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతల విషయంలో తెలంగాణ నెంబర్‌వన్.. పన్నుల వసూళ్లలోనూ తెలంగాణ అగ్రస్థానంలో ఉంది.. పరిపాలనలో కూడా పాలమూరు బిడ్డలు నెంబర్‌వన్.. అంటూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**నల్లమల్ల డిక్లరేషన్ ప్రకటించిన రేవంత్**

నల్లమల బిడ్డగా ఇక్కడ నిలబడి మాట్లాడుతుంటే నా గుండె ఉప్పొంగుతోంది. అచ్చంపేట నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎన్నికల ప్రచారంలో మాట ఇచ్చాం. దాని మాట ప్రకారం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మాచారంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లమల డిక్లరేషన్ ప్రకటించారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి మొత్తం రూ.12,600 కోట్లతో వారి అభివృద్ధి, సాధికారత కోసం పనులు చేపడతామని తెలిపారు. 1. తెలంగాణ ప్రభుత్వం 2006 ఆర్వోఎఫ్ ఆర్ చట్టం ప్రకారం 6.69 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 2 లక్షల 30 వేల 7 వందల 35 షెడ్యూల్డ్ తెగలకు (ST) అటవీ హక్కులను గుర్తించి, హక్కులు కల్పించింది. 2. ఆర్వోఎఫ్ ఆర్ రైతులు తమ భూములకు నీటిపారుదల సౌకర్యం కల్పించాలన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, సీఎం రేవంత్ రెడ్డి జనవరి 10న జరిగిన సమావేశంలో RoFR భూములు కలిగి ఉన్న ST రైతులకు సోలార్ పంపు సెట్ల ఆధారిత నీటిపారుదలని అందించడంపై చర్యలకు ఆదేశించారు. ప్రత్యేక పథకం కింద 100% గ్రాంట్‌తో బిందు సేద్యం & ఉద్యానవన తోటల పెంపకం. 3. భారతదేశంలో మొట్ట మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వం గిరిజన కుటుంబాల జీవనోపాధి, ఆదాయాన్ని పెంపొందించడానికి "ఇందిర సౌర గిరి జల వికాసం" పథకాన్ని రూపొందించింది. 4. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆర్వోఎఫ్ ఆర్ భూములకు నీటిపారుదల సౌకర్యాల కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. 5. అందుకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం ఆర్వోఎఫ్ ఆర్ భూముల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా "ఇందిర సౌర గిరి జల వికాసం" అనే పథకానికి శ్రీకారం చుట్టింది. 6. ఈ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి మే 19న నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మాచారంలో ప్రారంభించారు, ఇది 27 ST ఆర్వోఎఫ్ ఆర్ రైతులకు చెందిన 44.5 ఎకరాల ఆర్వోఎఫ్ ఆర్ భూమికి సంబంధించింది. 7. ఈ పథకంలో సమగ్ర భూ అభివృద్ధి, ఆఫ్‌గ్రిడ్ సోలార్ పంప్ ఇరిగేషన్ వ్యవస్థల సంస్థాపన చర్యలు. బిందు సేద్యంతో ఉద్యానవన తోటల పెంపకం. 8. ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం 2025, 26 నుండి 2029, 30 వరకు 5 ఏళ్ల పాటు అమలవుతోంది. అటవీ, ఇంధనం, ప్రజారోగ్యం, ప్రజారోగ్యం & అభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, భూగర్భ జలాలు, ఉద్యానవన శాఖల రంగాలలో వారికి చేయూత అందించనున్నారు. 9. రాష్ట్రంలోని అన్ని వెనుకబడిన గిరిజన సమూహాల కుటుంబాలకు ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం కింద ఇళ్ల మంజూరు. 10.రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వయం ఉపాధి కోసం రూ.1000 కోట్ల సబ్సిడీతో 1 లక్ష మంది ఎస్టీ నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందించాలని నల్లమల డిక్లరేషన్ లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ఆకస్మిక తనిఖీలు

సంతృప్తి కనిపించాలని సిఎం అన్నారు. కొన్ని శాఖల్లో మార్పు వచ్చిందని... అయితే ఆర్టీసీ వంటి చోట్ల ఇంకా సేవల్లో నాణ్యత పెరగాల్సి ఉందని సిఎం అన్నారు. దీపం 2 పథకం ద్వారా లబ్దిదారులకు ఏడాదికి ఇచ్చే 3 సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్దిదారుల ఖాతాలో జమ చేస్తామని సిఎం అన్నారు. లబ్దిదారులు తమకు కావాల్సినప్పుడు దీపం పథకం కింద సిలిండర్ పొందవచ్చు... అయితే వారికి మూడు సిలిండర్లకు ఇచ్చే మొత్తాన్ని ప్రభుత్వం ముందుగానే చెల్లిస్తుంది. దీపం పథకం లబ్దిదారుల నుంచి ఏజెన్సీ వాళ్లు కానీ, ఇతర స్థాయిల్లో గాని ఎక్కడా డబ్బులు అదనంగా వసూలు చేసే పరిస్థితి ఉండకూడదన్నారు.

మీరు ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా... అని ప్రశ్నించగా 74 శాతం మంది అవునని, వాటి నాణ్యతపై ఎలా ఉంది అంటే బాగుందని 76 శాతం మంది చెప్పారు. రేషన్ పంపిణీలో, నాణ్యతపై ప్రజల సంతృప్తిలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. అదే విధంగా గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారా... అనే అంశంలో 62 శాతం మంది లేదు అని చెప్పారు. పలు చోట్ల ఈ విషయంలో సమస్య ఉందని.... నేరుగా వారి ఖాతాల్లో ముందుగానే డబ్బులు వేయడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఆర్టీసీ సేవల విషయంలో ప్రయాణికుల నుంచి ఆశించన స్థాయిలో సంతృప్తి వ్యక్తం కాలేదని... ఈ విషయంలో అధికారులు మరింత ప్రభావవంతంగా పనిచేయాలని సిఎం అన్నారు. బస్టాండ్‌లలో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ విషయంలో ప్రయాణికుల నుంచి అసంతృప్తి వస్తోందని దీన్ని సరిచేసుకోవాలని సిఎం అన్నారు. తాగునీటిపై 44 శాతం, టాయిలెట్లపై 55 శాతం మంది అసంతృప్తి వెల్లడించారు.

ఇంటి నంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే ప్రశ్నకు 60 శాతం మంది అవుననే చెప్పారు. గతంతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ మెరుగైందని సిఎం అన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు తడిచెత్త నిర్వహణ బాధ్యత అప్పగించి... కంపోస్ట్ తయారీ చేపడతామని సిఎం అన్నారు.

ప్రభుత్వ సేవల విషయంలో డాటా అనలటిక్స్ కీలకమని సిఎం అన్నారు. డాటా ఆధారంగా ఆయా ప్రభుత్వ శాఖల తమ పనితీరును క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సమర్థవంతంగా విశ్లేషిస్తే ప్రభుత్వ సేవల్లో అనూహ్య మార్పులు తేవచ్చన్నారు. ఒక ప్రభుత్వ పథకం, లేదా కార్యక్రమంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్న సందర్భంలో వాటికి కారణాలను తెలుసుకుని దానికి అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రతి శాఖలో ఉన్నతాధికారులు ఆయా శాఖలపై వచ్చే డాటాపై అనలటిక్స్ ద్వారా సేవలను మెరుగుపరచాలని సిఎం సూచించారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 325 సేవలు అందుతున్నాయి. మన మిత్ర ద్వారా వాట్సాప్ సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 45 లక్షల మంది ఈ సేవలను విజయవంతంగా వినియోగించుకున్నారు. జూన్ 12వ తేదీ నాటికి 500 సేవలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి కసరత్తు జరుగుతోంది. అదే విధంగా ప్రభుత్వ ప్రతిపాదిత డ్రోన్ సిటీ... ఓర్వకల్ ఇండస్ట్రియల్ నోడ్‌లో 300 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ఇందులో మొదటి దశ 116 ఎకరాల్లో నెలకొల్పుతున్నారు. దీనిలో 38 సంస్థలు భాగస్వాములు అయ్యేందుకు ఆసక్తి చూపించాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిపిఆర్ సిద్ధం కాగా... టెండర్ల ప్రక్రియ జూన్ 12 నాటికి పూర్తి అవుతుంది.

## కుండబద్దలు కొట్టిన సుప్రీం

పిటిషనర్ వెంటనే భారతదేశం విడిచి వెళ్లాలని ఆదేశించిన మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ కె వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారిస్తోంది.పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనం ముందు మాట్లాడుతూ.. అతను శ్రీలంక తమిళుడని, వీసాపై ఇక్కడికి వచ్చాడని, తన స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని అన్నారు. పిటిషనర్ దాదాపు మూడు సంవత్సరాలుగా ఎటువంటి బహిష్కరణ ప్రక్రియ లేకుండా నిర్బంధంలో ఉన్నారని ఆయన తెలిపారు. "ఇక్కడ స్థిరపడటానికి మీకు ఏ హక్కు ఉంది?" అని జస్టిస్ దత్తా ప్రశ్నించారు. పిటిషనర్ ఒక శరణార్థి అని, అతని భార్య, పిల్లలు భారతదేశంలో స్థిరపడ్డారని న్యాయవాది పునరుద్ఘాటించారు. చట్టం ప్రకారం ఏర్పాటు చేసిన విధానం ప్రకారం పిటిషనర్ స్వేచ్ఛను హరించడం జరిగిందని, ఆర్టికల్ 21 ఉల్లంఘన జరగలేదని జస్టిస్ దత్తా అన్నారు. ఆర్టికల్ 19 ప్రకారం భారతదేశంలో స్థిరపడే ప్రాథమిక హక్కు పౌరులకు మాత్రమే అందుబాటులో ఉందని జస్టిస్ దత్తా తెలిపారు.పిటిషనర్ తన దేశంలో ప్రాణాలకు ముప్పు ఎదుర్కొంటున్నాడని న్యాయవాది చెప్పినప్పుడు, జస్టిస్ దత్తా స్పందిస్తూ "వేరే దేశానికి వెళ్లిపో" అని అన్నారు.

# సోషల్ మీడియా బాధ్యత తప్పుతోందా..?

దేశప్రజలను ఉద్దేశించి మోడీ చేసిన ప్రసంగం చాలా ప్రధానమైంది. మోదీ ఎన్నో అనుమానాలకు జవాబిచ్చే ప్రయత్నం చేశారు. పహల్గాం దాడి తర్వాత భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ప్రతి రాజకీయ పార్టీ స్వాగతించిందని, యావత్ భారత ప్రజలు మద్దతు పలికారని చెప్పుకొచ్చారు.



'ఉగ్రవాదులను తుదముట్టించేం దుకు భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛని చ్చామన్నారు.మన సోదరీమణులు, మన కుమార్తెల నుదుటి నుంచి సిందూరం తొలగిస్తే ఏం జరుగుతుందో ఇప్పుడు ప్రతి ఉగ్రవాదికీ, ప్రతి ఉగ్రవాద సంస్థకూ తెలిసొచ్చిం ది' అని, 'ఉగ్రవాదం, చర్చలు ఒకేసారి సా ధ్యం కావు. ఉగ్రవాదం, వాణిజ్యం కూడా ఒకేసారి సాధ్యం కావు. నీరు, రక్తం కలిసి ప్రవహించలేవు' అని కూడా ప్రకటించారు. ఇదంతా సరే.. ఇదే రోజు అమెరికా అ ధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'భారత్ మ ధ్య యుద్ధాన్ని నేనే ఆపాను.పాకిస్థాన్‌ను కాళ్లబేరానికి రప్పించామని మనం అంటున్నాం. ఉగ్రమూకలను తుదముట్టించి తీరుతామంటున్నాం. పాక్ మాత్రం మనకంటే ముందే భారత్‌పై విజయం తనదేనని నిర్మొహమాటంగా ప్రకటించుకున్నది. కానీ పాకిస్థాన్‌లో మసూద్ అజర్, హఫీజ్ సయీద్ వంటి ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే ఉన్నారు. పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకున్నామని మోదీ అంటున్నారు. అయితే..ఇకముందు ఉగ్ర మూక లు దాడులకు తెగబడవా? వారి నుంచి భారత్‌కు ఎలాంటి ముప్పు ఉండదా? అనే ప్రశ్న ఇప్పుడు తలెత్తుతున్నది. మే 12న జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య కాల్పులు జరిగాయి. కాల్పుల్లో 'లష్కర్ ఏ తోయిబా' అనే ఉగ్రవాద సంస్థకు చెందిన ముగ్గురు మృతిచెందారు.ఈ దాడికి ముందు ఇదే నెల 8వ తేదీ రాత్రి సాంబా జిల్లా పరిధిలోని దేశ సరిహద్దు నుంచి ఏడుగురు ఉగ్రవాదులు చొరబడేందుకు యత్నించారు. వారందరినీ భారత భద్రతా బలగాలు మట్టుపెట్టాయి. చొరబాటుదారులంతా 'జైషే మహమ్మద్' అనే ఉగ్రవాద సంస్థకు చెందిన వారని తర్వాత తెలిసింది.ఇలా ఎప్పటికప్పుడు పాక్ ప్రభుత్వంతో పాటు ఉగ్రవాద సంస్థలు భారత్‌ను కవ్విస్తున్న ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయి. అలాంటప్పుడు ఇకపై భారత్‌లో ముష్కరుల దాడి కారణంగా 'ఒక్క ప్రాణం కూడా పోదు' అని ధీమాగా ఉండగలమా?రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొనప్పుడు సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు రాతలు సరికాదు. మనకు వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉందన్న మాట వాస్తవమే.

కానీ.. అవి భారత రాజ్యాంగం ఇచ్చిన విలువైన హక్కులు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ (ఆర్టికల్ 19(1ఎ)) ప్రకారం ప్రతి పౌరుడు తన అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రకటించే హక్కు ఉంది.తన విశ్వాసాలను నిర్భయంగా మాట్లాడే హక్కు ఉంది. అది మౌఖికంగానైనా. రాత పూర్వకంగానైనా. లేదా ఇతర ఏ పద్ధతుల్లోనైనా ఆ స్వేచ్ఛను వినియోగించుకోవచ్చు. కానీ.. ఆ స్వేచ్ఛను విచక్షణా రహితంగా, ఆలోచనా రహితంగా వినియోగించుకోవడం మరో దుర్మార్గమే అవు తుంది. ప్రజలు శాంతి యుతంగా ప్రదర్శనలు నిర్వహించవచ్చు.నిరసన కార్యక్రమా లు చేపట్టవచ్చు.వృత్తి లేదా వ్యాపారం ఏదైనా చేసుకోవచ్చు. ఆ చర్యలన్నీ దేశ సార్వభౌమాధికారానికి, దేశ సమగ్రతకు భంగం కలిగించకూడదు. ప్రజాశాంతికి, నైతికతకు విరుద్ధంగా ఉండకూడదు. మతం, జాతిపరమైన వైషమ్యా లను పెంచకూడదు. భావవ్యక్తీకరణ హక్కు ప్రజాస్వామ్యానికి చాలా అవసరం. అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి, సమాజంపై ప్రభావాన్ని చూపడానికి సహాయపడతాయి. స్వేచ్ఛను బాధ్యతాయుతంగా వాడుకోవాలి. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ ప్రభుత్వ అధికారిక 'ఎక్స్' అకౌంట్‌ను భారత్ నిషేధించింది. అలాగే పలువురు పాకిస్థాన్ జర్నలిస్టులు, ఆదేశ రక్షణశాఖ 'ఎక్స్' ఖాతాలనూ బ్లాక్ చేసింది. ఇదే క్రమంలో పాకిస్థాన్‌కు చెందిన 16 యూ ట్యూబ్ చానళ్లతో పాటు ఆ దేశ ఓటీటీలను సైతం నిషేధించింది. నిషేధిత చానెల్ జాబితాలో మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్‌కు చెందిన యూట్యూబ్ చానల్ కూడా ఉంది. కశ్మీర్‌పై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న కారణంతోనే భారత్ ఇలాంటి చర్యలు చేపడుతున్నది. సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం 2021లోని నిబంధనల ప్రకారం భారత ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నది. అయితే.. ఇటీవల కేంద్రం 'ది వైర్' వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయడంపై దేశవ్యాప్తంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.పాకిస్థాన్ నుంచి వచ్చే కథనాలను ఆ వెబ్‌సైట్ నుంచి తొలగించాలనే ఆదేశాలు న్నాయి. నిషేధిత వెబ్‌సైట్ల జాబితాలో 'ది వై ర్' వంటి వెబ్‌సైట్‌ను చేర్చడం న్యాయం కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి డీ రాజా అభిప్రాయపడ్డారు. అలాగే ఇంటర్నెట్ ఫ్రీడం ఫౌండేషన్ తరపు న్యాయవాది, ఫౌండర్ డైరెక్టర్ అపర్ గుప్తా సైతం 'ది వైర్' వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఫేక్ న్యూస్ కూడా దేశ సమగ్రతకు ప్రమాదం. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరిలో ఆర్మీ బ్రిగేడ్‌పై ఆత్మాహుతి దాడి జరిగినట్లు ఇటీవల ప్రసార మాధ్యమాల్లో వార్తలు ప్రసారమయ్యాయి. దాడి జరిగినట్లు వార్తలు ప్రసారమవుతున్న ఏడు వీడియోలను కేంద్ర ప్రభుత్వం పరిశీలించింది. చివరకు ఆ వార్తల్లో వాస్తవం లేదని, ఆ వీడియోలు ఫేక్ అని తేల్చింది. అలాగే పంజాబ్‌లోని జలంధర్‌పై డ్రోన్ అటాక్ జరిగినట్లు వచ్చిన వార్తలు కూడా ఫేక్ అని ప్రకటించింది.ఇలా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటూ నిజానిజాలను ప్రజల కు చెప్పడం ఎంతో మేలు చేస్తుంది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) చాలా సమర్థంగా పనిచేస్తుదనడానికి పై విషయాలే నిదర్శనం. ప్రజలు ఫేక్ వార్తలు నమ్మొ ద్దు. వాస్తవం తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రజల్లో భయాందోళనలు కలిగించే విధంగా పోస్టులు పెడుతున్నారు.వీడియోలు షేర్ చేస్తున్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు పీఐబీ ప్రకటనలు చదవితే మేలు. చదవడమే కాదు.. పుకార్లు లేదా ఫేక్ న్యూస్‌ను ఎదుటి వారికి తెలియజెప్పాలి. అలాగే సైనికులు కుటుంబాలకు అండగా నిలవాల్సిన సందర్భం ఇది. ముఖ్యంగా యుద్ధంలో పాల్గొని అమరులైన వారి కుటుంబాలకు బాసటగా నిలవాలి.



# అద్భుత క్షేత్రం కాళేశ్వరం

■ మంత్రి బండి సంజయ్ కుమార్

**జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :**

కాళేశ్వరాన్ని అద్భుతమైన అధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రభుత్వానికి పుష్కర ఏర్పాట్లపై లేదని విమర్శించారు. కాళేశ్వరం పుష్కర ఘాట్ లో పుష్కర స్నానమాచరించి ముక్తేశ్వరుడిని సోమవారం బండి సంజయ్ కుమార్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. కుంభమేళాలో 50 కోట్ల మంది భక్తులకు అద్భుతమైన ఆతిధ్యమిచ్చామని తెలిపారు. కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు రూ.35 కోట్లు మాత్రమే కేటాయించారని అట్టి నిధులు సరిపోవని ఇంకొన్ని నిధులు కేటాయించాలన్నారు. కుంభమేళా సందర్భంగా 50 కోట్ల మంది భక్తులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన ఆతిథ్యమిచ్చిందని, కాళేశ్వరం పుష్కరాలకు విచ్చేసే 50 లక్షల మందికి ఆతిథ్యం ఇవ్వాలని అన్నారు. సోమవారం మధ్యాహ్నం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సతీమణి బండి అపర్ణతో కలిసి కాళేశ్వరం విచ్చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు కేంద్ర సహాయ మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి సంజయ్ కి పోలీస్ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య బండి సంజయ్ దంపతులు సరస్వతి నదీమతల్లి పుష్కర స్నానాన్ని ఆచరించారు. అక్కడి నుండి నేరుగా సరస్వతి మాతను, శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులకు పూజారులు ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా ఈరోజు కాళేశ్వరం విచ్చేసి పుష్కర స్నానం ఆచరించడం చాలా సంతోషంగా ఉందని, గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమని, 12 ఏండ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు హాజరై స్నానమాచరించడం ఆనందంగా ఉందని అన్నారు. దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, వారి కష్టాలన్నీ తొలగిపోవాలని, నరేంద్రమోదీ నాయకత్వంలో దేశానికి మరింతగా సేవలందించేలా దీవించాలని ఆ స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. సరస్వతి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రు. 35 కోట్లు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. ఉత్తర ప్రదేశ్ లో నిర్వహించిన కుంభమేళా సందర్భంగా 60 కోట్ల మంది భక్తులకు అద్భుతమైన ఆతిథ్యం ఇచ్చామని అన్నారు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులందరి కోర్కెలు తొలగిపోవాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నానని అన్నారు. కాళేశ్వరం చాలా పవర్ ఫుల్ ప్లేస్ అని తెలిపారు. కాళేశ్వరంను అద్భుతమైన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్నాని తెలిపారు.

## అందాల పోటీలే కాదు

ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎప్పటినుంచో వ్యాపారి కుటుంబం అక్కడే నివాసం ఉంటోంది. దురదృష్టవశాత్తూ అగ్నిప్రమాదం జరిగి, ఒకే కుటుంబంలో ఏకంగా 17 మంది చనిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. వారు జీవనోపాధికి దోహద పడాలంటే భారీ పరిహారం అందించి ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కుటుంబంలో జరిగిన విషాదం, మరో కుటుంబానికి జరగకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ లోనే కాదు జిల్లాల్లోనూ రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో తక్షణం వారికి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు. ఇంత పెద్ద అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అంబులెన్స్‌లో ఆక్సిజన్ మాస్క్ లేకుండా, ఫైర్ ఇంజన్‌లో నీళ్ళు లేకుండా ఘటనా స్థలానికి రావడం వల్లనే మా కుటుంబ సభ్యులను కోల్పోయామని బాధితులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. అగ్నిప్రమాదం జరిగిందని సమాచారం తెలియగానే అవసరమైన పరికరాలు లేకుండా అంబులెన్స్, అరకొర నీళ్లతో ఫైరింజన్లు వస్తే ఏం లాభమన్నారు.ఆ కుటుంబంలో 17 మంది చనిపోయినా వారు ఎలాంటి రాజకీయాలు చేయడం లేదని, తమకు చుట్టుపక్కల వారు సాయం చేశారని.. మరో కుటుంబానికి ఈ గతి పట్టకుండా చూడాలని మాత్రమే బాధిత కుటుంబం చెప్పిన విషయాన్ని తెలంగాణ ప్రభుత్వం గుర్తించాలన్నారు. పక్కనే పోలీస్ స్టేషన్ ఉంటే అక్కడ నుండి ఇద్దరు పోలీసులు మాత్రమే వచ్చారు అంటూ బాధిత మహిళ తన గోడు కేటీఆర్‌కు వెళ్లబోసుకున్నారు. నిర్లక్ష్యం కారణంగానే వారి ప్రాణాలు దక్కలేదని, ఆక్సిజన్ మాస్కులు ఉంటే కొందరైనా బతికేవారని అన్నారు.

## యూ ట్యూబర్..

బెంగళూరు వందేభారత్ రైలును ప్రారంభించిన సమయంలో ఓ రేంజ్‌లో హడావిడి చేసింది జ్యోతి మల్హోత్రా. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అప్పటి గవర్నర్ తమిళిసైతోపాటు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పాల్గొన్న కార్యక్రమంలో వీడియోలు తీస్తూ హల్‌చల్ చేసింది ఈ యూట్యూబర్. గూఢచర్యం కేసులో అరెస్ట్ తర్వాత జ్యోతి మల్హోత్రా అప్పటి వీడియోలు, ఫోటోలు సోషల్‌మీడియాలో ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.జ్యోతి మల్హోత్రా హైదరాబాద్‌కి కేవలం వందేభారత్ రైలు ఓపెనింగ్ ప్రోగ్రాం కోసమే వచ్చిందా? లేదంటే ఆ సమయంలో ఇంకెవరినైనా కలిసిందా? వేరే వీడియోలు ఏమైనా తీసిందా? అప్పుడంటే యూట్యూబర్. కానీ ఇప్పుడే తెలిసింది తను మన శత్రుదేశంతో సమాచారం షేర్ చేసుకుంటోందని. అందుకే హైదరాబాద్‌లో అప్పట్లో ఆమె యాక్టివిటీపైన కూడా ఆరాతీస్తున్నాయి ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీస్. యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కొన్నాళ్లక్రితం ఒడిశాలోని పూరీకి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఒడిశాకు చెందని మరో యూట్యూబర్ ప్రియాంక సేనాపతితో ఆమె చాలా క్లోజ్‌గా ఉంది. మరోవైపు పూరీజగన్నాథ్ ఆలయంపై ఉగ్రవాదులు కన్నేసినట్లు నిఘాసంస్థలు ఇప్పటికే హెచ్చరించాయి. మూడు నెలల క్రితమే యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పూరీకి ట్రావెలర్‌గానే వచ్చిందా.. లేదంటే ఇంకేమన్నా కారణముందా అన్న యాంగిల్‌లోనూ సాగుతోంది పోలీసు ఎంక్వయిరీ.హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు పూరీకి చెందిన యూట్యూబర్ ప్రియాంక సేనాపతితో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్నారు. జ్యోతితో పాటు పూరీ యూట్యూబర్ కూడా పాకిస్తాన్‌లోని కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారాకు వెళ్లినట్లు దర్యాప్తులో తెలిసింది.

దీంతో ఒడిశా పోలీసులు, ఐబీ అధికారులు ఆ మహిళ గురించి ఎంక్వయిరీ చేస్తున్నారు. అయితే ప్రియాంక సేనాపతి మాత్రం తనకు జ్యోతితో.. ఎలాంటి సంబంధం లేదని.. ఇద్దరం యూట్యూబర్లం మాత్రమేనంటోంది. అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లొద్దని ప్రియాంక సేనాపతికి పోలీసులు ఆదేశాలు జారీ చేశారు.ఉగ్రదాడి జరగడానికి కొన్ని నెలలముందు జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌కి వెళ్లింది యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా. దీంతో ఆ టూరిస్ట్ ప్లేస్ సమాచారాన్ని తను ఎవరితోనైనా షేర్ చేసుకుందా అన్న డౌట్‌తో ఆ దిశగా కూడా ఎంక్వయిరీ చేస్తున్నాయి నిఘాసంస్థలు. పహల్గామ్‌దాడిని ఖండిస్తూ తర్వాత లైవ్ వీడియో చేసింది జ్యోతి మల్హోత్రా. ఆమె టూర్, రియాక్షన్ రెండూ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. కాగా.. తమ కూతురు ఢిల్లీకి వెళ్లి వస్తుండేదని, ఆమె పాకిస్తాన్‌కి వెళ్తున్నట్లు తమకు ఎలాంటి సమాచారం లేదని జ్యోతి మల్హోత్రా తండ్రి హరీష్ తెలిపారు.

# పోడు భూముల సమస్య పరిష్కరించి.. రైతులకు పట్టాలివ్వాలి

■ సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి

**జయభేరి, నేరేడు గొమ్ము :**

ప్రజా పాలనలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి అన్నారు.సోమవారం సిపిఐ నేరేడుగోమ్ము మండల 4వ, మహాసభ జిల్లా సమితి సభ్యులు యసాని పాండురంగా రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ మహా సభకు ముఖ్య అతిదిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై మహాసభ ప్రారంబానికి ముందు ఏర్పాటు చేసిన సిపిఐ జండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో నర్సింహా రెడ్డి మాట్లాడు తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఎర్రజండా పోరాడుతుందని అధికారం లేకున్నా ప్రజల పక్షాన నిలబడిన ఎర్రజండా 100 ఏళ్ల ప్రస్థా నంలో ప్రజల గుండెల్లో నిలిచిపోయిందని అన్నారు. ప్రజలు బుర్జువా రాజకీయ పార్టీల వలలో పడి మో సపోకుండా కష్టాల్లో బాగమయ్యే కమ్యూనిస్ట్ పార్టీని అందరించాలని అన్నారు.పార్టీని నేరేడుగోమ్ము మండలంలో విస్తరించాలని నాయకత్వం అదిశగా పనిచేయాలన్నారు.పార్టీలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులను చేపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.నేరేడు గోమ్ము




మండలానికి సంభందించిన లిఫ్ట్ లను ప్రభుత్వం త్వ రతగతిన పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగు నీ రందించాలని అన్నారు.నేరేడుగొమ్ము మండలంలో గిరిజనులు,ఇతర రైతులు ఎన్నో ఏళ్లుగా పోడు భూములు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారని ప్రభుత్వం పోడు భూముల సమస్యను పరిష్కరించి రైతులకు పట్టాలివ్వాలని కోరారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా తడిసిన దాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభు త్వం,అధికారులను ఆయన కోరారు.ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు,గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా,జిల్లా సమితి సభ్యులు దేపా సుదర్శన్ రెడ్డి, యాసాని పాండు రంగా రెడ్డి,సిపిఐ మండలకార్య దర్శి బొమ్ము అచ్చయ్య,సహాయ కూరాకుల రమే ష్,శాఖ కార్యదర్శులు బొమ్ము రామాంజనేయులు, మాసమోని బిక్షం,బెజవాడ లక్ష్మయ్య, వెంకటాచారి ,తదితరులు పాల్గొన్నారు.

## మహిళ వేలును కొరికివేసిన చీటీ నిర్వహకుడు

**జయభేరి, హైదరాబాద్ :**

మధుర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక చీటీ నిర్వహకుడు ఒక మహిళ చూపుడు వేలు కొరికివేసాడు. దాంతో మహిళ వేలు ఊడి కిందపడ్డాది. ఆ వేలు పట్టుకుని బాదితురాలు ఆస్పత్రికి పరుగులు తీసింది. వైద్యులు వేలును అతికించలేమని చెప్పారు. హైదరాబా ద్ మధురానగర్ లో ఘటన జరిగింది. పోలీసులు నిందితుడు హేమంత్ ను అరెస్ట్ చేసాడు.

## భయాందోళనలో కళారంగ్ కాలనీ వాసులు

**జయభేరి, సికింద్రాబాద్:**

సమీర్ ను బోయిగూడలో ని కళారంగ్ కాలనీలో విజయనగరం పోలీసులు.16వ తేదీన అరెస్ట్ చేసారు. సమీర్ అక్కడ తల్లి సబెరా, చెల్లి అలియా తో కలసి ఉంటున్నాడు. సమీర్ ఇంటిపక్క ఉన్న బస్తి వాసులు భయాందోళనలో వున్నారు. ఎప్పుడూ తమతో గొడవలు పడేవారు అంటూ బస్తివాసులు తెలిపారు. వెంటనే వారిని ఇక్కడి నుంచి ఖాళీ చేయించాలంటే బస్తివాసుల డిమాండ్. సికింద్రాబా ద్ రైల్వే స్టేషన్ లో బాంబు పెట్టేందుకు చూశారంటూ పోలీసులు తెలిపారని బస్తివాసులు చెప్పారు. ఎప్పుడు ఓల్డ్ సిటీకి చెందిన పలు బ్యాచులతో రూమ్లో సమావేశం అయ్యవారు అని అన్నారు.

## ఒకే దేశం ఒకే ఎన్నిక అసాధ్యం

**జయభేరి, భువనగిరి:**

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మీడియా సమావే శంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ వైఖరి అవలం బిస్తుంది. ఒకే దేశం ఒకే ఎన్నిక అసాధ్యం.... రాజుల పరిపాలన దిశగా బీజేపీ అడుగులేస్తోంది. పహాల్గం ఉగ్రదాడి విషయం లో బీజేపీ విధానం తానే పాలక వర్గం తానే ప్రతిపక్షం తీరును గా వ్యవహారిస్తుంది. ఉమ్మడి రాష్ట్ర ప్రజల ఆరోగ్య ప్రయోజనాలు కాపాడే ఎయిమ్స్ ను స్థానిక కేంద్ర మంత్రులు పట్టించుకోవడం లేదని అన్నారు.

## చెన్నూరు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ నేతలపై దాడి

**జయభేరి, మంచిర్యాల:**

చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల సమావేశంలో ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే వివేక్ సమక్షంలో ప్రజా సమస్యల పై మాట్లాడిన నాయకుడు పోగుల సతీష్ పై టీపీసీసీ మెంబర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేయి చే సుకోవడం తో గందరగోళం ఏర్పడింది. ప్రజా సమస్యలు అడిగిన వారిపై చేయి చేసుకోవడం ఏంటని స్థానిక కాంగ్రెస్ నేతలు ప్రశ్ని స్తున్నారు.

## డ్రగ్స్ పై ప్రభుత్వ ఉపాధ్యాయుడి వినూత్న ప్రచారం

**జయభేరి, మహబూబాబాద్:**

మరిపెడ మండల కేంద్రంలో సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రభా కర్ గౌడ్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు మత్తు పదార్థాలు,మాదక ద్రవ్యాలపై వినూత్నంగా ప్రచారం చేపట్టాడు. మత్తు పదార్థాలను అతి చిన్న వయసులో వినియోగిస్తూ తమ విలువైన జీవితాలను విద్యార్థులు చిదిమి వేసుకుంటున్నారు అని ఆవేదన వ్యక్తం చేస్తు న్నాడు. మత్తు పదార్థాలను వినియోగించి తల్లి తండ్రులకు గర్భ శోకం మిగిల్చకూడదని మత్తు పదార్థాలు,మాదక ద్రవ్యాల కు వ్యతిరేకంగా ప్రచారాన్ని ప్రారంభించినట్టు ఆయన పేర్కొన్నాడు. ప్రభుత్వ ఉపాధ్యాయులు వేసవి సెలవులను ఉత్సాహంగా గడిపే నేపద్యం ఉన్న తరుణంలో సామాజిక బాధ్యత ను గుర్తెరిగి మత్తు పదార్థాల వినియోగం పై ప్రచారం చేయడం పట్ల ఉపాధ్యాయుడి ని స్థానికులు అభినందిస్తున్నారు.

# ఘన చరిత్ర కలిగిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం

■ ఆధ్యాత్మిక పరిమళాలు విరజిమ్ముతున్న "వర్గల్ క్షేత్రాలు"

■ శ్రీ విద్యాధరి క్షేత్రంతో 30 ఏళ్లుగా అనుబంధం

■ జ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతున్న శ్రీ విద్యాధరి అమ్మవారు

■ ఎంపీలు ఈటల రాజేందర్, మాధవనేని రఘునందన్ రావు

**జయభేరి, వర్గల్, మే 19 :**




వర్గల్ క్షేత్రాలు ఆధ్యాత్మిక పరిమళాలు విరజి మ్ముతున్నట్లు ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నా రు. సోమవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీ విద్యాధరి క్షేత్రాలను ఎంపీ రఘునందన్ రావు, జిల్లా బిజెపి అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ తో కలిసి దర్శించుకోవడంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురాతన శ్రీ వేణుగోపాల స్వామి క్షేత్ర బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం పూర్వజన్మసు కృతమని స్పష్టం చేశారు. అయితే 800 ఏండ్ల ఘన చరిత్ర కలిగిన ఈ ఆలయం చారిత్రాత్మక చిహ్నంగా నిలుస్తుందని తెలిపారు. భక్తులు, దాత టేకులపల్లి రాంరెడ్డి కృషి, సహకారంతో పూర్వవైభవం సంతరించుకోవడం హర్షదాయ కమని అన్నారు. ఎంతో మహత్యం కలిగిన పు ణ్యక్షేత్రాలకు వర్గల్ కొలువుదీరిందని చెప్పారు. అలాగే వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంతో 30 ఏళ్లుగా తనకు ఎంతో అనుబంధం ఉందని, శంభుగిరి కొండలపై కొలువుదీరిన శ్రీ విద్యాధరి అమ్మవా రు లక్షలాదిమంది భక్తుల కొంగుబంగారంగా నిలుస్తోందని పేర్కొన్నారు. బాసర పుణ్యక్షేత్రం తరహాలో రూపుదిద్దుకుంటున్న ఈ క్షేత్రం లక్ష లాది మంది చిన్నారులకు జ్ఞానాన్ని ప్రసాదిస్తూ, అక్షరాలు నేర్పిస్తూ గొప్పగా విలసిల్లాలని ఆకాం క్షించారు. ముఖ్యంగా చిన్నారులకు ఓనమాలు నేర్పిస్తూ జ్ఞానవంతులుగా తీర్చిదిద్ది చక్కటి విద్యను ప్రసాదిస్తున్న శ్రీ విద్యాధరి ఆలయం అనతికాలంలోనే గొప్ప పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి కెక్కిందని చెప్పారు. లక్షలాదిమంది భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతున్న ఈ ఆలయం తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ కోవెలగా నిలుస్తుం డడంలో బ్రహ్మశ్రీ, చంద్రశేఖర శర్మ సిద్ధాంతి కృషి వెలకట్టలేనిదని వివరించారు. కాగా మొదటగా ఎంపీలు ఈటల రాజేందర్, రఘు నందన్ రావులకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలకడంతో పాటు శేష వస్త్రంతో సత్క రించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, మాజీ అధ్యక్షుడు బాల్రెడ్డి, సీనియర్ నాయకులు రాంరెడ్డి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదిత రులు పాల్గొన్నారు.



# బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవం

**జయభేరి, వర్గల్, మే 19 :**

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికి ఖల్స గ్రామంలో సోమవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ చండీశ్వర బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదా లు, మహా అన్న ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా కురుమ పెద్దలు మాట్లాడుతూ కురుమల కుల దైవం శ్రీ చండీశ్వర బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవానికి సహక రించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండాలని, పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని కోరుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఐదు సం వత్సరాలకు ఒకసారి గ్రామంలో ఘనంగా నిర్వహించే శ్రీ చండీశ్వర బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవం ఈ సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందని, సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు నీలం శ్రీశైలం, ఉపాధ్యక్షుడు మల్లేశం, కురుమ కుల సంఘం సభ్యులు, యువకులు, చిన్నారులు, మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.







## కబ్జాకు పాల్పడిన వారి పై చర్యలు తీసుకోవాలి

■ ఫైళ్ళ ఆశయ్య డిమాండ్

**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి రజక ఆత్మగౌరవం భవనం స్థలంలో కొంతమంది భూ కబ్జాదారులు నీనా రాత్రి,రాత్రి అక్రమంగా గుడిసె వేశారు, సిమెంట్ ఇటికలతో రూములు కూడా నిర్మించారు. ముఖ్యమంత్రి పేరుతో ఎనుముల రేవంత్ రెడ్డి నగరని ఫ్లెక్సీ కూడా కట్టారు. గుడిసెలు అన్నిటిని స్థానిక మేడిపల్లి మండల్ తహసిల్దారి అక్రమ కట్ట డాలను, గుడిసెలు కూల్చారు. ఈ సమస్య తెలవగానే వెంటనే ఆత్మగౌరవ స్థలాన్ని పరిశీలన చేసి మీడియాకు అధికారులకు ద్వారా భూ కబ్జాదారుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రజక వృత్తిదాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫైళ్ళ ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థలాన్ని పరిశీలించారు,వెంటనే ఆ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.. వారితో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జ్యోతి ఉపేంద్ర, మేడిపల్లి మండల ప్రెసిడెంట్ అంబే చక్రపాణి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు సట్టు రవి, నరేందర్, మేడిపల్లి మండల స్థానిక రజక సంఘం నాయకులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## లీకేజీ తో నీరు వృధా.. మిషన్ భగీరథ

■ పట్టించుకోని అధికారులు



**జయభేరి, నకిరేకల్ :**

నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గం కేతపల్లి మండలం తుంగతుర్తి గ్రామా నికి వెళ్లే రహదారిలో మిషన్ భగీరథ పైప్ లైన్ మూడు నాలుగు దిక్కుల లీకేజీ కావడంతో నీరు వృధాగా పోతున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలలో పలు విమర్శలు వెలువెత్తుతున్నాయి ఒకవైపు వేసవికాలం దృష్ట్యా నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులు నెలకొనే తరుణంలో ఇలా పైప్ లైన్ లీకేజీ తో నీరు వృధాగా పోతున్న సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తైనా చూడకపోవడం గమనార్హమని ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అదేవిధంగా పైపులైను లీకేజీ తో నీరు కలిసి తమవై ఆనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్కడ లీకేజ్ అవుతున్న మిషన్ భగీరథ పైప్ లైన్ అలా లీకేజీ కాకుండా తగు మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గోషాలకు గడ్డిని అందజేత



**జయభేరి, తుర్కపల్లి, మే 19 :**

తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి తన వ్యవసాయ బావి వద్ద నుండి యాదగిరిగుట్ట దేవస్థానం గోశాలకు రెండు ట్రాక్టర్ల ,సుమారు 150 కట్టల గడ్డిని సోమవారం అందజేశా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చాలామంది వరి చేనుల్లో కోసిన అనంతరం గడ్డిని చేన్లలో తగలబెట్టకుండా ఆ గడ్డిని సేకరించి గోశాలకు పంపించినచో గోవులకు ఆహారాన్ని అందించిన వారమవుతామని, ఆపుణ్యం దక్కుతుందని అన్నారు

## బదిలీపై వెళ్తున్న కార్యదర్శిని సన్మానించిన గ్రామస్తులు



**జయభేరి, తుర్కపల్లి, మే 19 :**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో గత మూడు సంవత్సరాల ఏడు నెలల పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సేవలందించిన శ్రీనివాస్ బదిలీపై బొమ్మలరామారం మండలానికి వెళ్తున్న సందర్భంగా గ్రామస్తులు సోమవారం ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రామంలో మూడున్నర సంవత్సరాల పాటు గ్రామ అభివృద్ధికి సహకరించి బదిలీపై వెళ్లడంపై పలువురు బాధను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కారోబర్ పలుగుల ప్రశాంతి, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, వాటర్ మెన్స్ మల్లేష్, రాములు, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చంద్రమ్మ ,ఎల్లమ్మ, భాగ్యమ్మ ,నరసింహ, మల్లేష్ పాల్గొన్నారు.

# చార్మినార్ గుల్జార్ హౌస్ ప్రమాదానికి అదే కారణం



జయభేరి, హైదరాబాద్, మే 19:

చార్మినార్ పరిధిలోని గుల్జార్ హౌస్‌లో ఆదివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. గుల్జార్ హౌస్ చౌరస్తాలోని G+2 భవనంలో మంటలు చెలరేగాయి. భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగిన ఘటనలో మొత్తం 17 మంది మృతిచెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. చనిపోయిన వారిలో ఏడేళ్ల లోపు వయస్సున్న 8మంది చిన్నారులు ఉన్నారు ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని పోలీసులు, అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అగ్నిప్రమాదంపై అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఏసీ షార్ట్ సర్క్యూట్ కావడం వల్లే అగ్నిప్రమాదం జరిగిందని వెల్లడించారు. వంట గదిలో సిలిండర్ పేలడం, ఇంట్లో చెక్కతో చేసిన ప్యానెళ్ల వల్లే మంటలు వేగంగా వ్యాపించాయని పేర్కొన్నారు. ఉదయం 06:16 గంటలకు చార్మినార్‌లోని గుల్జార్ హౌస్ చౌరస్తాలోని G+2 భవనంలో మంటలు చెలరేగాయని సమాచారం అందడంతో మొఘల్‌పురా నుంచి ఫైరింజన్లు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాయి. మొదట గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు చెలరేగాయి. ఆపై మొత్తం బిల్డింగ్ కు మంగలు వ్యాపించాయి. అగ్నిమాపక, రెస్క్యూ ఆపరేషన్లు ఒకేసారి జరిగాయి. ఈ క్రమంలో మొదటి అంతస్తులో చిక్కుకున్న 17 మందిని అగ్నిమాపక శాఖ సిబ్బంది బిల్డింగ్ నుంచి బయటకు తీసుకొచ్చింది. గాయపడిన వారిని అంబులెన్సులలో పలు ఆసుపత్రులకు తరలించారు.
అగ్నిమాపక, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఓవైపు మంటలను ఆర్పుతూనే మరోవైపు భవనంలో చిక్కుకుని స్పృహ కోల్పోయిన వారిని, కాలిన గాయాలైన వారిని భయటకు తీసుకొచ్చారు. వారిని అంబులెన్స్ లలో మలక్ పేట యశోద, డీఆర్డీవో, ఉస్మానియా, అపోల్ ఆస్పత్రులకు తరలించారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అసలే ఆదివారం కావడంతో వారు ఇంకా నిద్ర నుంచి మేల్కోలేదు. అందువల్లే మొదటి అంతస్తు నుంచి మంటలు బిల్డింగ్ మొత్తానికి వ్యాపించినా అప్రమత్తం కాలేకపోయారు. అగ్నిప్రమాదం గురించి గుర్తించేలోపే మంటలు అంతా వ్యాపించాయి. పొగ పీల్చడం, ఊపిరి ఆడకపోవడంతో వెంటనే వారు స్పృహ కోల్పోయారు. దాంతో వారిని ఆస్పత్రులకు తరలించినా ప్రయోజనం లేకపోయింది.ప్రమాదం జరిగిన భవనానికి ఫైర్ ఎగ్జిట్ (అత్యవసరంగా బయట పడేందుకు మార్గం) లేకపోవడంతో వారు భవనం నుంచి బయటకు రాలేకపోయారని తెలుస్తోంది. మరోవైపు ఇరుకైన గల్లీలు కావడంతో అగ్నిమాపక యంత్రాలు రెస్క్యూ ఆపరేషన్ వేగవంతం చేయడానికి ఇబ్బందులు తలెత్తాయని స్థానికులు చెబుతున్నారు. అయితే అత్యాధునిక టెక్నాలజీ వినియోగించి లోపల చిక్కుకున్న వారిని రక్షించి హాస్పిటల్స్‌కు తరలించామని ఎస్డీఆర్ఎఫ్ తెలిపింది.

**మృతుల వివరాలు..**

ప్రహ్లాద్ (70), మున్నిభాయి (70), రాజేంద్రకుమార్ మోదీ (67), సుమిత్ర (60), హమే (7), అభిషేక్ మోదీ (31), శీతల్ జైన్ (35), ప్రియాంష్ (4), ఇరాజ్ (2), ఆరుషి జైన్ (3), రిషబ్ (4), ప్రథమ్ 18 నెలలు, అనుయాన్ (3), వర్ష (35), పంకజ్ (36), రజిని (32) అపోలోలో చికిత్స పొందుతున్న ఐదుగురు మృతిచెందారు. హైదర్ గూడ అపోలో హాస్పిటల్ నుంచి పంకజ్ మోదీ, అతని భార్య వర్ష మోదీ, సోదరి రజిని అగర్వాల్, పంకజ్ మోదీ ఇద్దరు పిల్లలు అన్య మోదీ, ఇద్దు మోదీల మృతదేహాలను పోలీసులు ఉస్మానియా మార్చురీకి తరలించారు. మొత్తం 11 అగ్నిమాపక వాహనాలు, 01 అగ్నిమాపక రోబో, 17 అగ్నిమాపక అధికారులు, 70 మంది సిబ్బంది మంటలను ఆర్పడంతో పాటు బిల్డింగ్ లోపల చిక్కుకున్న వ్యక్తులను రక్షించడానికి సహాయక చర్యలలో పాల్గొన్నారు. మంటలను ఆర్పడానికి 2 గంటలు టైం పట్టింది. లోపల చిక్కుకున్న వారిని రక్షించడానికి, మంటలను ఆర్పడానికి అధికారులు, ఫైర్ సిబ్బంది తీవ్రంగా కృషి చేశారని ఎస్డీఆర్ఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది.



## నవ వధువుకు ఆర్థికసహాయం

- మార్కుక్ మండల్ బిఆర్ఎస్ బి సి సెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్

జయభేరి, మార్కుక్, మే 18 :

సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన దర్శనాల కవిత కనకయ్య కూతురు స్పందన వివాహానికి 5,000రూ ఆర్థిక సహాయం అందజేసిన మేకల కనకయ్య ముదిరాజ్ వారితో పాటు పాములపర్తి బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్ల మహేష్ చెక్కల నర్సింలు కొట్టాల మహేష్ తదితరులు వున్నారు

## ధాన్యం కొనుగోలు లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్

- కొనుగోలు కేంద్రంలోని వడ్లను పరిశీలిస్తున్న మాజీ ఎఫ్డీసి



జయభేరి, గజ్వేల్, మే 19 :

గజ్వేల్ లోని మార్కెట్ యార్డులో వరి ధాన్యాన్ని గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పరిశీలించరు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం లో రోడ్ల వెంబడి కొన్ని వేల క్వింటాళ్ల వరి ధాన్యం రోడ్ల మీద ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం వారి ధాన్యం కొనడంలో విఫలమైందని తెలిపారు. మార్కెట్ యార్డులలో రోడ్ల వెంబడి ఎక్కడ చూసినా వరి ధాన్యమే కనిపిస్తుందని కనీసం కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా వరి ధాన్యాన్ని కొనడంలో లారీలను బార్ధాన్ను సమకూర్చడంలో విఫలమైందని మండిపడ్డారు.అకాల వర్షాలతో వరి ధాన్యం కొన్ని చోట్ల తడిసిపోవడం వలన రైతులు లబోదిబోమంటున్న వరి ధాన్యం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కొనడం లేదని మండిపడ్డారు.ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల పట్ల దయ చూపి తొందరగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంటుకు రాజు మరికంటి కనకయ్య మల్లేశం ప్రవీణ్ తదితరులు ఉన్నారు

## పోలీస్ వెరిఫికేషన్ పేరుతో ఎన్టీపీసీ కార్మికులను వేదించడం సరికాదు

- క్యారెక్టర్ సర్టిఫికెట్ స్థానిక పోలీస్ స్టేషన్ నుండి తీసుకురావాలని యాజమాన్యం నిబంధన




జయభేరి, పరవాడ:

ఎన్ టి పి సి కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం పోలీస్ నుండి క్యారెక్టర్ సర్టిఫికెట్ తీసుకురావాలని నిబంధన పెట్టడం సరికాదని ఈ నిబంధనను వెంటనే తొలగించాలని ఎన్టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఎన్ టి పి సి మెయిన్ గేట్ ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్టిపిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్ టి పి సి యాజమాన్యం ఒక ప్రైవేట్ మార్వాడి కంపెనీ కంటే ఘోరంగా కార్మికులను వేధింపులు గురిచేస్తుందని అన్నారు. ఎన్టిపిసి లో ఇప్పటివరకు వైద్య పరీక్షల పేరుతో కార్మికులను వేధించే వారిని ఇది కొనసాగుతూ ఉండగానే క్యారెక్టర్ సర్టిఫికెట్ పోలీస్ స్టేషన్ నుండి తీసుకురావాలని నిబంధన పెట్టడం దుర్మార్గం అన్నారు 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కార్మికులకు ఇప్పుడు పోలీస్ క్యారెక్టర్ సర్టిఫికెట్ ఇవ్వాలని నిబంధన పెట్టడం దుర్మార్గమన్నారు ఈ చర్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని గని శెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పి పి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి గోవిందరాజు, రమణ, శ్రీను, రామారావు, తదితరులు పాల్గొన్నారు

## వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు



జయభేరి, పరవాడ:

ఈ బోనంగి ఫార్మసిటీ పునరావాస కాలనీ కొండపై వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు తమ్మిరెడ్డి సతీష్ ఆర్థిక సహాయంతో లక్ష్మీదేవి గోదాదేవి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట మరియు ద్వారపాలకుల విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు హరికృష్ణ ఆచార్యుల ఆధ్వర్యంలో కమిటీ వారి పరిరక్షణలో విగ్రహ ప్రతిష్ట హోమములు ఘనంగా జరిపారు అనంతరం భక్తులకు కరగాని సూర్యనారాయణ దంపతులు ఆర్థిక సహాయంతో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామ గోవిందరావు, లాలం అప్పలనాయుడు,మేడిశెట్టి బాలాజీ నాయుడు, గొర్లె శ్రీనివాస్, సత్యనారాయణ, ధనరాజు, లోవరాజు, శేఖర్, దీపిక దంపతులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలందరూ చల్లగా ఉండేలా దీవించు తల్లి

- శ్రీ శివ్వంపేట పోచమ్మ-మైసమ్మ అమ్మవార్లును దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్,హరివర్ధన్ రెడ్డి, వజ్రేష్ యాదవ్



జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరు గ్రామంలోని శ్రీ శివ్వంపేట పోచమ్మమైసమ్మ జాతర ఉత్సవాలు గత వారం రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. కాగా సోమవారం మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఏడాది మంచి వర్షాలు పడి రైతులందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రజలందరూ చల్లగా ఉండేలా దీవించాలని అమ్మవార్లను కోరుకున్నట్లు తెలిపారు. పూజారి కార్తీక్ భవిష్యవాణి ఆకట్టుకునే విధంగా వినిపించారు. అనంతరం గావు, బలిగంప ఊరేగింపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని మహిళలు, ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు,మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,సాయిపేట శ్రీనివాస్,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## తెలంగాణ ప్రాంత క్రీడాభారతి నూతన ప్రాంత కమిటీ ఎన్నిక



జయభేరి, మేడ్చల్ :

ఆరు సంవత్సరాల బాలుడి నుంచి తొంబై ఏళ్ల వయసున్న వృద్ధులు సైతం ఎదో ఒక క్రీడ ఆడటం వలన వారు మానసికంగా దృఢంగా ఉంటారని అఖిల భారతీయ సంఘటన మంత్రి మానేనియా ప్రసాద్ మహంకార అన్నారు. ఈ సందర్భంగా అర్హులైన క్రీడాకారులకు క్రీడా కేంద్రం తరపున మంచి శిక్షణ ఇచ్చి నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడించటంతో పాటు చాలా క్రీడల్లో అనేక మంది క్రీడాకారులు డూఫింగ్ అని లంచాలు తీసుకుని పట్టుబడుతున్నారని అన్నారు.
లంచం తీసుకోకుండా అర్హులైన వారిని సైతం క్రీడల్లో ఆడించడానికి ఆర్థిక స్తోమత లేక వెనుకబడిపోతున్నారని తెలిపారు. ఆర్థిక స్తోమత లేక అర్హులైన వారికి క్రీడాభారతి తరపున ప్రోత్సాహం అందించి ఆర్థిక సహాయాన్ని చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు.
దీంతో పాటు దివ్యాంగులకు సైతం ఏదో ఒక ఆటలలో ప్రావీణ్యం పొందేటట్టు చేయటం వల్ల దేశంలో ఉన్నటువంటి క్రీడలలో రాణించగలుగుతున్నారని అన్నారు. క్రీడలలో అనేక రకాలైన అసోసియేషన్స్ ఉంటాయని వాటినన్నింటిని ఒక్క తాటిపైన తీసుకొచ్చి దేశం యొక్క ఔన్నత్యాన్ని, దేశ గౌరవాన్ని ప్రపంచ దేశాల్లో చూపించడమే క్రీడా భారతీయ యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ప్రాంత కార్యవర్గ సభ్యులు ఎర్ర నర్సింగ్, ప్రాంత ప్రచారక్ సభ్యుడు శ్రీధర్ లు పాల్గొని తెలంగాణ ప్రాంత క్రీడాభారతి కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సతీష్ గౌడ్, ఉపాధ్యక్షుడు దుర్గా ప్రసాద్, కార్యదర్శులు బట్టికాడి హనుమంత్ రావు, కార్యదర్శి బాబులాల్ జైన్, బీటీ కన్నయ్య, సభ్యులు వర్మ, కృష్ణారెడ్డి, శ్వేతాజీ, బందర్, కోశాధికారి నరేంద్ర కృష్ణలు పాల్గొన్నారు.



## పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు.

జయభేరి, పరవాడ:

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా పరవాడ ఊర చెరువు ఉపాధి హామీ కార్మికులు వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత వీర తెలంగాణ సాయుధ పోరాటయోధుడు స్వతంత్ర భారత పార్లమెంట్లో మొదటి ప్రతిపక్ష నాయకుడిగా సిపిఎం అఖిలభారత ప్రధాన మొట్టమొదటి ప్రధాన కార్యదర్శిగా కష్టజీవుల కోసం నిరంతరం పోరాడి తన జీవితాన్నే ప్రజలకు అంకితం చేసిన కమ్యూనిస్టు గాంధీగా గుర్తింపు పొందారు. నేడు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆయన ఆశయ సాధన కోసం ప్రజా సమస్యలపై ప్రజలను ఐక్యం చేసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గని శెట్టి సత్యనారాయణ, రమణమ్మ, పార్వతి, లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలోనే ఉగ్రమూలాలు

జయభేరి, మెదక్, మే 19ఛ

తెలంగాణలో ఉగ్రమూలాలు ఉండటం కలకలం రేపుతోంది. సంగారెడ్డి నుంచి ఓ వ్యక్తి పాకిస్థాన్ కు పకడ్బందీగా సమాచారాలు చేరవేస్తున్నాడు. అస్సాం పోలీసులు మొత్తం ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 948 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆ సిమ్ కార్డులను నిందితులు సైబర్ క్రైమ్స్‌తో పాటు యాంటీ నేషనల్ ఆపరేషన్లకు వినియోగించారని పోలీసులు స్పష్టం చేశారు. ఇటీవల జ్యోతి అనే హర్యానాకు చెందిన యూట్యూబర్ దేశ సమాచారాన్ని పాకిస్తాన్ ఏజెంట్లకు చేరవేసిందన్న కేసులో అరెస్ట్ చేశారు. ఆమెకు పాక్‌తో ఉన్న మరిన్ని లింకుల గురించి తెలుసుకునేందుకు పోలీసులు విచారణ చేపట్టారు.ఆపరేషన్ ఘోస్ట్ సిమ్ రాకెట్ కేసును అస్సాం పోలీసులు ఛేదించారు. మన దేశానికి చెందిన సిమ్ కార్డులతో OTPలు చెప్పి పాకిస్తాన్‌లో వాట్సప్ అకౌంట్లు క్రియేట్ చేసే ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు భారత్‌కు సంబంధించిన పక్కా సమాచారాన్ని పాక్ లోని కొందరు ఏజెంట్లకు చేరవేస్తున్నారని NIA దగ్గర కీలక సమాచారం ఉంది. అస్సాం పోలీసులు అరెస్ట్ చేసిన ఏడుగురు నిందితుల్లో ఒకరు సంగారెడ్డిలో ఉంటున్నాడు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గొల్లపల్లిలో ఉంటున్న మోఫిజుల్ ఇస్లాం పాకిస్తాన్‌కు సమాచారం చేరవేస్తున్నట్లు గుర్తించారు.కేంద్ర ఇంటలిజెన్సీ బలగాల హెచ్చరికతో అప్రమత్తమైన అస్సాం పోలీసులు మొత్తం ఏడుగురు సిమ్ రాకెట్ నిందితులను అరెస్ట్ చేశారు. అందులో ఇస్లాం అనే వ్యక్తి అస్సాం నుంచి వచ్చి సంగారెడ్డిలో కూలీ మేస్త్రిగా జీవనం సాగిస్తున్నాడు. ఇక్కడున్న యువకులను ఉగ్రవాదులుగా తయారు చేయడం, ఫేక్ సిమ్ కార్డులు క్రియేట్ చేసి పాకిస్తాన్ ఏజెంట్లకు పక్కా సమాచారం ఇవ్వడం ఇస్లాం పనిగా పెట్టుకున్నాడు. అస్సాంలో మొబైల్ షాపులో పనిచేసిన ఇస్లాం వేరే వ్యక్తుల గుర్తింపు కార్డులతో సిమ్ లు తీసుకుని అధిక ధరలకు విక్రయించేవాడు. ప్రస్తుతం సంగారెడ్డిలోని గొల్లపల్లిలో ఉంటున్న నిందితుడు పాకిస్తాన్ వారికి సైతం సిమ్ లు విక్రయించడంతో పాటు దేశంలో ప్రస్తుత పరిస్థితిని, యుద్ధం సమయంలో మీడియాలో వచ్చిన సమాచారాన్ని పాక్ లోని వ్యక్తుల వాట్సాప్ గ్రూపులో చేరవేసేవాడు. నిందితులు దేశంలోని పలు రాష్ట్రాల్లో చిన్నాచితకా పనులు చేసుకుంటూ, సామాన్యులుగా జీవనం సాగిస్తున్నట్లు చుట్టుపక్కల వారిని నమ్మించేవారు. తమపై అనుమానం రాకుండా పాక్‌కు దేశ సమాచారం చేరవేసినట్లు అధికారులు గుర్తించారు. దర్యాప్తులో మరిన్ని విషయాలు తేలనున్నాయి. వీరితో పాటు ఇంకా ఎవరైనా పాక్ కోసం పనిచేశారా, వీరి ప్లాన్ ఏంటనేది అధికారుల తేల్చనున్నారు.



# తమిళ అగ్రహీరో తెలుగు సినిమా షురూ..

అటు స్టార్‌గా ఇటు నటుడిగా రెండు విధాలుగా గుర్తింపు తెచ్చుకున్న అతి కొద్ది మంది హీరోల్లో తమిళ అగ్రహీరో సూర్య ఒకరు. తెలుగునాట కూడా ఆయనకు అభిమానులు కోకొల్లలు. సూర్య నేరుగా తెలుగులో నటిస్తే చూడాలనే కోరికను కొన్నేళ్లుగా వివిధ సందర్భాల్లో అభిమనులు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. సూర్య కూడా తెలుగు సినిమా చేసేందుకు అనువైన సందర్భం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు ఆ సందర్భం రానేవచ్చింది. ఆయన డైరెక్ట్‌గా తెలుగులో చేస్తున్న సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు సోమవారం హైదరాబాద్‌లో జరిగాయి. టాలీవుడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకుడు. ప్రతిష్టాత్మక టాలీవుడ్ నిర్మాణ సంస్థ సితార ఎంటైర్టైన్మెంట్స్ ఈ సినిమాను నిర్మిస్తుంది.

హీరో హీరోయిన్లు సూర్య, మమితా బైజులపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి అగ్ర దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ క్లాప్ కొట్టగా, నిర్మాత ఎస్.రాధాకృష్ణ బౌండ్ స్క్రిప్ట్‌ని దర్శకుడు వెంకీ అట్లూరికి అందించారు. సార్, లక్కీభాస్కర్ చిత్రాల తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి జి.వి.ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. రవీనా టాండన్, రాధిక శరత్‌కుమార్ కీలక భూమికలు పోషిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని, వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. తెలుగుతోపాటు తమిళంలో కూడా ఏకకాలంలో ద్విభాషా చిత్రంగా సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రానికి కెమెరా: నిమిష్ రవి, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.

# మైత్రీ మూవీస్‌లో సూపర్‌స్టార్ ?..



**రజనీ కోసం కథ రెడీ చేసిన వివేక్ ఆత్రేయ!**

సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో టాలీవుడ్ ప్రతిష్టాత్మక నిర్మాణసంస్థ మైత్రీ మూవీమేకర్స్ ఓ చిత్రాన్ని నిర్మించనున్నట్లు ఓ వార్త ఫిల్మ్ సర్కిల్‌స్‌లో బలంగా వినిపిస్తున్నది. దేశంలోని అగ్ర హీరోలందరితో సినిమాలు చేయాలన్న సంకల్పంతో మైత్రీ మూవీమేకర్స్ ముందుకెళ్తున్నదని సంస్థ అధినేతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్ ఓ సందర్భంలో చెప్పారు. ఇప్పటికే బాలీవుడ్ హీరో సన్నీడియోల్‌తో 'జాట్', కోలీవుడ్ హీరో అజిత్‌తో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలను నిర్మించిన మైత్రీ సంస్థ.. ఇప్పుడు రజనీకాంత్‌తోనూ ఓ ప్రాజెక్ట్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నది. తెలుగులో డీసెంట్ సినిమాలు తీసిన ఓ యంగ్ డైరెక్టర్‌కి ఈ సినిమా బాధ్యతలు అప్పగించబోతున్నారనేది ఇన్‌సైడ్ వర్గాల టాక్. ఆ దర్శకుడెవరో కాదు.. వివేక్ ఆత్రేయ. సూపర్‌స్టార్ కోసం వివేక్ ఓ కథ రెడీ చేసుకున్నారట. త్వరలో రజనీకి ఆ కథ వినిపించబోతున్నారట. నిజానికి మైత్రీ సంస్థలో సినిమా చేసేందుకు రజనీ ఇప్పటికే సిద్ధంగా ఉన్నారు. అయితే.. దర్శకుడెవరనేది మాత్రం ఇంకా ఖరారు కాలేదు. వివేక్ కథ సూపర్‌స్టార్‌కి నచ్చితే.. డైరెక్టర్ ఖరారైనట్టే. మెంటల్ మదిలో, బ్రోచేవారెవరురా, అంటే సుందరానికి వంటి డీసెంట్ హిట్‌లను తెరకెక్కించిన వివేక్ ఆత్రేయ.. 'సరిపోదా శనివారం'తో కమర్షియల్‌గానూ విజయాన్ని అందుకున్నారు. సూపర్‌స్టార్ కోసం తాను తయారు చేసుకున్న కథ కూడా రజనీ మాస్ ఇమేజ్‌కి తగ్గట్టుగా ఉంటుందని తెలుస్తున్నది.



# ఆగస్టు 29న పెళ్లి ఫిక్స్..

తమిళ్ స్టార్ హీరో విశాల్‌కు తెలుగులోనూ మంచి క్రేజ్ ఉంది. ఆయన నటించిన ఎన్నో సూపర్ హిట్ చిత్రాలు తెలుగులోకి డబ్ అయ్యి విజయాన్ని అందుకున్నాయి. సహజమైన నటనతో సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఓవైపు వరుస సినిమాలతో బిజీగా ఉండడమే కాకుండా.. సౌత్ ఇండస్ట్రీ నటీనటుల సంఘం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఈ మధ్య విశాల్ పేరు వార్తల్లో తెగ వినిపిస్తుంది. ఆయన అనారోగ్యానికి గురవ్వడంతో విశాల్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొన్నామధ్య బక్కచిక్కిపోయి వణుకుతూ కనిపించాడు.. జ్వరం వల్లే అలా అయ్యారని ఆతర్వాత విశాల్ టీమ్ క్లారిటీ ఇచ్చింది. నిన్నటికి నిన్న ఓ ఈవెంట్ లో కాళ్లు తిరిగి పడిపోయాడు. ఇక ఇప్పుడు విశాల్ పెళ్లి గురించిన వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఎప్పటి నుంచో విశాల్ పెళ్లి గురించి చర్చలు జరుగుతూనే ఉంటాయి. తాజాగా విశాల్ వివాహం పై క్లారిటీ వచ్చింది. నటి సాయి ధన్సిక ను వివాహం చేసుకోబోతున్నట్టు అనౌన్స్ చేశారు విశాల్. చెన్నైలో నిర్వహించిన ఓ సినిమా ఈవెంట్లో పెళ్లి చేసుకోనున్నట్టు అధికారికంగా ప్రకటించారు విశాల్, సాయి ధన్సిక. అంతే కాదు తమ వివాహం ఆగస్టు 29న జరుగుతుందని తెలిపారు. సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన కబాలి సినిమాలో హీరో కూతురిగా నటించింది ధన్సిక. ఆ తర్వాత తెలుగులో తెరకెక్కిన షికారు, అంతిమ తీర్పు, దక్షిణ వంటి చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిందీ అందాల తార ప్రస్తుతం తమిళ్ లో సినిమాలు చేస్తుంది.



# లేటెస్ట్ గా అదితి శంకర్ ..

మామూలు హీరో, హీరోయిన్లు అభిమానించే స్టార్స్, డైరక్టర్స్ గురించి తెలుసుకోవాలని ఎంత ఆసక్తి చూపిస్తామో, స్టార్ కిడ్స్ ఇష్టాయిష్టాలను తెలుసుకోవడానికి అంతకు మించిన ఇంట్రస్ట్ ఉంటుంది. లేటెస్ట్ గా అదితి శంకర్ చెప్పిన విషయాలు క్షణాల్లో వైరల్ కావడం కూడా అందులో భాగమే. తెలుగు సినిమాల గురించి, తెలుగు ఆర్టిస్టుల గురించి మాట్లాడటమే కాదు, తెలుగు మూవీ కోసం గొంతు సవరించుకున్న క్రెడిట్ కూడా ఉంది అదితి శంకర్‌కి. శంకర్ సినిమాలు హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకుంటున్నప్పుడు సెట్స్ కి వచ్చేవారట అదితి శంకర్. అప్పుడు తండ్రి మూవీస్ కోసం వచ్చి, ఇప్పుడు తన సినిమాల కోసం వస్తుంటే చాలా ఎగ్జయిటింగ్‌గా ఉందంటున్నారు అదితి. తెలుగులో తాను చూసిన ఫస్ట్ సినిమా మగధీర అని, అప్పటి నుంచి రాజమౌళికి, రామ్‌చరణ్‌కి తాను పెద్ద ఫ్యాన్ అయిపోయానని చెప్పారు. తన సినిమాల గురించి నాన్నతో డిస్కస చేయనని, అన్నీ ఓన్ డెసిషన్స్ తీసుకుంటానని చెబుతున్నారు అదితి. కానీ, తన సినిమాలను తండ్రి తప్పకుండా చూసి తీరాల్సిందేనని అంటున్నారు. చూడకపోతే అసలు ఒప్పుకోనని చెబుతున్నారు శంకర్ గారాలపట్టి.

# బోల్ట్ కాశీ పాత ఐడెంటిటీస్ ఏంటో..

## క్యూరియాసిటీ పెంచేస్తున్న విజయ్ సేతుపతి ఏస్ ట్రైలర్



పాన్ ఇండియా స్టార్ ఇమేజ్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి. మక్కళ్ సెల్వన్ హీరోగా నటిస్తున్న చిత్రం ఏస్ (Ace). 'ఒరు నల్ల నాల్ పాత్తు సొల్రేన్' ఫేం ఆరుముగకుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా... యోగి బాబు కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ మూవీ మే 23, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఇప్పటికే తెలుగు ట్రైలర్‌ను కూడా విడుదల చేశారు. ట్రైలర్‌లో నువ్వు అక్కడేం చేస్తావురా అని ఫ్రెండ్ అడుగుతుంటే.. పాత ఐడెంటిటీస్ అన్నీ చింపేసి అందరిలా మామూలుగా బతకాలనుంది. నా పేరు బోల్ట్ కాశీ అంటూ తనను తాను పరిచయం చేసుకుంటున్నాడు విజయ్ సేతుపతి. నువ్వు ఈ ఊరికి ఏ పని మీదొచ్చావ్ అని హీరోయిన్ అడిగితే ఏం చేయాలో నేను ప్లాన్ చేశానంటున్నాడు. అసలు నీ ప్లాన్ ఏంటో చెప్పరా అని యోగిబాబు అడుగుతుంటే నాకీ ప్లాన్ ఓకే అంటోంది రుక్మిణి వసంత్. ఇంతకీ బోల్ట్ కాశీ పాత ఐడెంటిటీస్ ఏంటీ.. అతని స్కెచ్ ఏంటనేది సస్పెన్స్‌లో పెడుతూ కట్ చేసిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజయ్ సేతుపతి నుంచి అభిమానులు ఆశించే అన్ని ఎలిమెంట్స్ సినిమాలో ఉండబోతున్నాయని ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది.

ఈ చిత్రాన్ని తెలుగులో ఎస్‌పీ సినిమాస్ విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే మేకర్స్ తెలియజేశారు. రొమాంటిక్ క్రైం కామెడీ నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీతో రుక్మిణి వసంత్ కోలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఈ చిత్రంలో దివ్య పిళ్లై, బబ్లూ పృథ్వీరాజ్, బిఎస్. అవినాష్, ముత్తు కుమార్, రాజ్ కుమార్, డెనెస్ కుమార్, ఆల్విన్ మార్టిన్, ప్రిస్సిల్లా నాయర్, జాస్పర్ సుపయ్య, కార్తీక్ జై, నాగులన్, జహినారిస్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని 7Cs ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ నిర్మిస్తుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com